# 8

# అనంతయాత్ర

చూపుల నిండా ఒట్టి శూన్యం.

వరండాలో గుంజనానుకుని నిలబడి అలాగే చూస్తోంది భారతి.... ఏభై సంవత్సరాల జీవితానుభవాల భారాన్ని హృదయం మోస్తూండగా

మనసు నిండా-

బ్రతుకు నిండా-

భవిష్యత్తు నిండా- శూన్యంతో - కళ్ళనిండా శూన్యంతో చూస్తోందామె దాదాపు ఓ గంట నుండి శిలలా నిలబడి-శూన్యంలోకి.

ఒట్టి వానచినుకుల శబ్దం నిశ్శబ్దంగా వినబడుతోంది.

చినుకుల్లో తడుస్తూ పర్ణశాల వంటి ఆ యింటి ముంగిట పూలు, గడ్డిపరకలు ఆనంద తాండవమాడుతున్నాయి.

ఎందుకీ మనుషులు ఇంత ప్రేమ రాహిత్యంలో పూర్తిగా వ్యాపార సరళిలో వేగం-వేగం- వేగంలో యంత్రాలై-పరుగు- పరుగు. పరుగులో పశువులై ఒట్టి బోలు హృదయంతో, బంధాలను తెంచుకుని ఆత్మీయతా హీనతలో బతుకుతున్నారు.

ఎందుకు వీళ్ళు తమ ఉనికినీ నైతికతనీ కనీస మానవ విలువలను మరచి మరబొమ్మల్లా జీవించడానికి అలవాటు పడుతున్నారు. ఇపుడు తన దగ్గరున్న దాన్ని కాదని తెలియని దేనికోసమో పరుగులు పెడ్తూ...

దాన్ని పొందిన తర్వాత కూడా ఇంకా ఇంకా పరుగులు పెట్టేది దేనికోసం-

అనంతమైన ఈ మధుర సృష్టినీ, ప్రకృతినీ విడిచి....

భ్రాంతిలో కొట్టుమిట్టాడ్తూ... వాళ్ళు పసిపిల్లలు.. పసిపిల్లలు... ప్చ్ ...

భరత్ చటుక్కున మనసులో మెదిలాడు.

భరత్-

డాక్టర్ భరత్, తన కొడుకు.

ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్ స్టార్-

వాడిని గాలిలోకి ఎగరేస్తూ మహదానంద ముద్రలో- తను పాడుకున్న పాట.

అప్పుడా గాలి పులకించి, వాడి పసిడి నవ్వులతో ప్రకృతి పులకించి, తల్లిగా తన హృదయం పురివిప్పి వికసించి, పరవశించి-,

ఓ ప్రైమరీ స్కూల్ టీచర్‌గా వాడికి-తను తల్లయి, గురువై, దైవమై, స్నేహితురాలై-హితురాలై

తను చెక్కిన శిల్పమే- కాని తనాశించిన ఆకృతి రాలేదు.

చిన్నప్పుడే తండ్రిని పోగొట్టుకున్న భరత్‌ను,

తను కన్నీళ్ళతో అభిషేకించి,

తను దీపమై, వాణ్ణి వత్తిని చేసి,

తనకు వాడే ఆకలై, వాడే దాహమై, వాడే రాత్రులై, పగలై, వాడే లక్ష్యమై, జీవితమై-

"భరత్ నువ్వేరా నా ఊపిరివి-"

ఎప్పుడు మాట్లాడినా తల్లిగా తను వాడితో ఈ ఒక్క వాక్యాన్నే మాట్లాడింది- ఇరవై ఎనిమిదేండ్లు.

ఏడవ తరగతిలో- జిల్లా స్థాయిలో భరత్ ప్రథముడుగా వచ్చిన రోజున.

ఎస్.ఎస్.సి.లో, రాష్ట్ర స్థాయిలో ర్యాంక్ తెచ్చుకున్న రోజున,

డిగ్రీలో బంగారు పతకం పట్టుకుని వచ్చివంగి పాదాభివందనం చేస్తుంటే-

తను గంగలా పొంగి-

జీవితం ధన్యమైపోతున్నట్లు, కల నిజమై తనూహించిన లక్ష్యం చేతి కందుతున్నట్టు పొందిన దివ్యానుభూతి-

భూమి చిరుగాలితో పులకించి పోయినట్టు,

తర్వాత ఎమ్.ఎస్సీ., పూర్తిచేసి- అక్కడా మూడు గోల్డ్‌మెడల్స్ కైవసం చేసుకుని-మైక్రో బయాలాజీలో పి.హెచ్.డీ.ని పొందిన రోజు రాత్రి-

ఆరోజూ ఇదే వర్షం- ఎడతెగని వర్షం.

వర్షంలో తడిచి వచ్చిన భరత్ పాదాభివందనం చేస్తూ- "మా యూనివర్సిటీ నన్ను అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా తీసుకుందమ్మా- ఈ అపూర్వ సాధనలో ఊపిరివీ, శక్తివీ, ఆధారానివీ అన్నీ నీవేనమ్మా-తల్లివే కాకుండా ఓనమాలు దిద్దించిన ఆది గురువైన నీకు ఈ జన్మంతా ఋణపడి వుంటాను... ఆశీర్వదించమ్మా-" అని ఒదిగిపోయిన ఆ వర్షం కురిసిన రాత్రి-

జీవితంలో నిరంతరం పరిమళించే ఓ మాసిపోని స్మృతి.

ఆ క్షణాన మిగిలింది-తృప్తి.

ఈ దేశం కోసం ఓ మనిషిని తయారు చేశానన్న తృప్తి.

తర్వాత.... తర్వాత.

ఈ నిరంతర యాత్రలో అలసిపోతున్నానిక - భరత్‌తో చెప్పి ఇక రవ్వంత విశ్రాంతి తీసుకుందామా అని అనుకున్న ఆ రాత్రి...

అప్పుడు కూడా యిదే కుండపోత వర్షం

ఐతే ఆ రాత్రి... తన గుండెలు పగిలిన రాత్రి.... దోసిట్లో పట్టుకున్న పూలు గాలికి కొట్టుకు పోయి బురద గుంటలో పడ్డ రాత్రి-

భరత్ కార్లో వచ్చి...

"ఆనాటి నుండీ నీకు చెప్ప లేదమ్మా... మా ప్రొఫెసర్ నన్ను అమెరికా రమ్మంటున్నాడని.... ఈ రోజే మెసేజ్ వచ్చింది.... ఈ రాత్రే బయలు దేరుతున్నాను" - అని హడావిడిగా తయారవుతున్న క్షణం...

"బయలుదేరుతున్నాను-".... ఐపోయింది. స్పష్టమైన నిర్ణయం జరిగి పోయింది...ప్చ్....

హృదయాన్ని చీల్చుకుని చీల్చుకుని కన్నీళ్ళు పొంగి పొంగి-

భరత్... వెళ్ళిపోతావురా....

యిన్నాళ్ళు నిన్ను పెంచి... పెద్దచేసి.... నీపై ఆశలు పెట్టుకుని జీవించిన నన్ను, నిన్ను కన్న ఈ నేలను.... ఈ తల్లిని .... ఈ దేశాన్ని విడిచి వెళ్ళిపోతావురా...." అని మౌనంగా రోధిస్తున్న క్షణం.

"ఎందుకు నాయనా వెళ్ళడం" అని అంటే.

"పన్నెండు వేల డాలర్ల జీతమమ్మా.... ఏసి కార్.... ఏసి అపార్ట్‌మెంట్.... ఇంకా.... ఇంకా చెప్పుకుపోతున్నాడు.

"యిక్కడకూడా నీక్కావలసిన కనీసావసరాలు సమకూరుతున్నాయి గద నయనా..."

"యివి నాకు చాలవమ్మా.... నా ప్రతిభకు ఈ ప్రభుత్వ మిస్తున్నది ఎంతో తక్కువ"

"ఒక పేద కుటుంబంలో పుట్టిన వాడు- తనొక్కడు బాగుపడగానే మిగతా కుటుంబ సభ్యులు తనకు తగిన విలువనూ, సౌకర్యాలనూ ఇవ్వడం లేదని ఆ కుటుంబాన్ని వదిలి పోవడం ద్రోహంకాదా..."

"అదంతా నాకనవసరం. నేను కేవలం నా గురించే చూసుకుంటాను"

ఈ మాటన్నది... డాక్టర్ భరత్.

ఈ దేశంలో, ఈ వ్యవస్థలో, ఈ జాతి జీవన విధానంలో ఎక్కడున్నది లోపం- అని యిన్నాళ్ళుగా తర్కించుకుంటున్న తనకు.... ఈ దేశం అందిస్తున్న విద్యా విధానంలో,

నిర్బంధంగా నేర్పించని నైతిక విలువల శూన్యతలో, నీవు నీ దేశం కోసం జీవిస్తున్నావు- అని నేర్పించని క్రమశిక్షణారాహిత్యంలో కనిపించింది దోషం-

యిక మాట్లాడలేదు.

పూర్తిగా నిర్మించిన భవనం లిప్తలో కూలి భూమట్టమై పోయిన వికృతానుభూతి.

తయారై....తనను కార్లో ఏర్ పోర్ట్‌కు తీసుకుపోయి... బహిరంగంగా కూడా పాదాభివందనం చేసి... హృదయాన్ని బద్దలుచేసి కాళ్ళుమొక్కే దుష్ట సంస్కృతికి ముగ్ధురాల నవుతుండగా.... వెళ్ళిపోయాడు ఆత్మను చీల్చుకుని.

ఆ విధంగా వెళ్ళిన భరత్- ఆరునెలల తర్వాత డ్యూటిపైన విజిటింగ్ ప్రొఫెసర్‌గా, ఇండియా వచ్చి...పది రోజులుగా వివిధ యూనివర్సిటీలలో లెక్చర్స్ యిస్తూ.... ఈ రోజు ఉదయం యిక్కడి స్థానిక యూనివర్సిటీకి వస్తూ....తన దగ్గరికి వచ్చి....

"అమ్మా .." అని పిలిచిన పిలుపులో ఎంత శూన్యత.... ఎంత కృత్రిమత్వం... ఎంత తెచ్చి పెట్టుకున్నతనం.

అప్పుడనిపించింది..... ఈ మనుషులకు చదువుల కన్నా సభ్యతను, సంస్కారాన్ని, మానవత్వాన్ని నేర్పించడం ప్రాథమికావసరం కాదా? అని-

"నేను నిన్ను కూడా నావెంట అమెరికా తీసుకు పోవాలనుకుంటున్నానమ్మా..." అన్నాడు.

"ఎందుకు"

"నీకు ఉన్న ఒక్కగానొక్క కొడుకును. నిన్నిక్కడ విడిచి వెళ్తే లోకం ఏమనుకుంటుంది"

"నేను నీకొక్కడికే తల్లినికాదు. ఈ సమాజానికీ, ఈ దేశానికీ మార్గదర్శనం చేయవలసిన పవిత్రమైన ఉపాధ్యాయవృత్తిలో యిక్కడ నాకు నా తరగతిలో యాభైమంది నా పిల్లలున్నారు. వీళ్ళందరినీ విడిచి.... నా తల్లియైన ఈ దేశాన్ని విడిచి నేను రాను"

తనలో స్పష్టత..... నిశ్చయం... వ్యక్తిత్వాన్ని కోల్పోకుండా ఉండగలుగుతున్నందుకు తృప్తి ...గర్వం.

"నా కోసం నా వెంట రాలేవా అమ్మా"

"ఇన్నాళ్ళు నీ కోసమే బతికి ఇవన్నీ చేశాను బాబూ. యిప్పుడు నేను నా కోసమే నీ వెంట రాలేను నాయనా"

అంతే...

ఓ ఛేదించలేని స్తబ్దత.... మౌనంతో నిండిన దుఃఖం.

చూస్తుండగానే....భరత్ వెళ్ళి పోయాడు కార్లో అన్ని బంధాలనూ అతి సునాయాసంగా తెంచుకుని.

యిది వరకు ఉన్నది శూన్యమే.

మళ్ళీ యిప్పుడు మిగిలిందీ- శూన్యమే.

మనసంతా ఖాళీ... ఒట్టి ఖాళీ.

"అ...మ్మా...."

ఎక్కడ నుంచో ఓ మూలుగువంటి పిలుపు.

జ్ఞాపకాలు తెగి పోతున్నాయి-

అలాగే నిలబడి.... వర్షంలోకి చూస్తోంది భారతి.

మళ్ళీఎక్కడ నుండో "అ....మ్మా...."

ఉలిక్కిపడింది భారతి. చెంపలపైనుండి ధారలుగా నీళ్ళు.... వర్షం చినుకుల సవ్వడి... ఎదురుగా చీకటి... ఎప్పుడు చీకటి పడిందో తెలియదు. గంభీరమైన నిశ్శబ్దం.

కళ్ళు చిట్లించి చూచింది భారతి...ఎక్కడనుండి ఆ పిలుపు వినపడుతోందా అని. లీలగా ఏదో ఆకారం కదలి తనవైపే వస్తున్నట్టు... కదలి లైటు వేసింది.

ఎవరో స్త్రీ....

వర్షంలో తడుస్తూ... ఆయాసంగా కదులుతూ... యిక తూలి పడిపోతుందా అన్నట్టు....

పరుగెత్తింది భారతి....

పొదివి పట్టుకుని.... భుజంపై నడిపిస్తూ....

" ఎవరమ్మా నువ్వు?"

"ఎవరూ లేని అభాగ్యురాలినమ్మా..."

అప్పుడు గమనించింది భారతి...ఆమె నిండు చూలాలు.

వరండాలోకి చేర్చి...కుర్చీలో కూర్చుండ బెట్టి....

ఆమె బాధగా కళ్ళు మూసుకుని చేతులు జోడించి దండం పెట్టింది.

భారతి ఓ టవల్‌ను ఆమె కందించి- వెళ్ళి చకచకా టీ తయారు చేసి తెచ్చి అందిస్తూంటే....

ఆమె చూచిన చూపులో ఎంత కృతజ్ఞత... ఎంత దీనత్వం.

"ఎవరమ్మా నువ్వు"

"చెప్పాను గదమ్మా... అభాగ్యురాలినని.... ఈ కడుపులో ఉన్న పాపాన్ని హతమార్చి- ఓ కొత్త జీవితాన్ని నిర్మించుకోవలసిన దాన్ని. జీవితంలో ఎన్నడూ ఓడిపోకూడదని అనుకుంటూనే ఎప్పుడూ ఓడిపోతున్న దాన్ని"

ఇరవైపైన ఉంటుందేమో ఆమె వయస్సు. అందమైందేమీ కాదుగాని అనాకారికాదు. కళ్ళలో పట్టుదలా, కసీ ఉన్నాయి.

యిక చెప్పలేక.... ఎగశ్వాసతో ఆయాసపడిపోతూ, జాకెట్టును తడుముకుని.... నెమ్మదిగా ఓ తడిచిన వార్తపత్రిక కటింగ్‌ను అందించిందామె.

తీసుకుని ఆశ్చర్యంతో విప్పింది భారతి. బయట వర్షం కురుస్తూనే ఉంది.

"యువకునికి బుద్ధి చెప్పిన యువతి" అదీ వార్త.

వరంగల్ సెప్టెంబర్ 16: ప్రేమించి- పెళ్ళి చేసుకుంటానని నమ్మించి ఓ యువతిని అనుభవించి, ఆమెను గర్భవతిని చేసి తర్వాత తెలుగు సినిమాల్లో వలె మెడను పట్టి బయటకు గెంటిన డబ్బున్న ఓ అందమైన యువకుడికి యువతి చిత్రమైన రీతిలో బుద్ధి చెప్పిన సంఘటన నిన్న యిక్కడ జరిగింది.,

స్థానిక గిర్మాజీపేటలో నివసించే యువతి కుమారి ఎ. రమాదేవి సహజంగానే మాయమాటలు నమ్మి వి. మోహన్ అనే ధనవంతుడైన ఓ యువకున్ని ప్రేమించింది. మోహన్ రూపసి కూడా. పెళ్ళి చేసుకుంటానని నమ్మించి ఆమెను గర్భవతిని చేసి తీరా ఆమె నిలదీసే సరికి.... అసలు నువ్వెవరో నాకు తెలీదనీ, ఐనా ఎంతో హాండ్సమ్‌గా ఉండే నేను చింతకాయలా ఉండే నిన్ను ప్రేమించడమేమిటి- కాకి ముక్కుకు దొండపండులా గెటౌట్, అని అన్నాడట. మౌనంగా వెళ్ళిపోయిన ఆ యువతి నిన్న మోటారు సైకిల్‌పై వెళ్తూ చౌరస్తాలో ట్రాఫిక్ సిగ్నల్ లైన్‌పై ఆపినపుడు- మెరుపులా ఎక్కడి నుండో పరుగెత్తుకొచ్చి చేతిలోని దాదాపు ఒక లీటర్ నైట్రిక్ ఆసిడ్‌ను అతని ముఖంపై కుమ్మరించింది. అందాన్ని ఆసరాగా చేసుకుని ఆడ పిల్లలను నాశనం చేస్తావురా బ్రూట్ అని అరుస్తూ- అక్కడే ఆమె పోలీసులకు లొంగిపోయింది.

ఐతే ఆమె అప్పటికే ఎనిమిది నెలల నిండు గర్భవతి.

- చదివి... నిట్టూర్చి తలెత్తి ఆ యువతి వైపు జాలిగా చూసింది భారతి.

ఆమె కళ్ళు మూసుకుని... సముద్రం ఎగిసి పడ్తున్నట్లున్నదల్లా కెవ్వున "అ...మ్మా..." అని కేకేసింది.

భారతికి అర్థమైంది.

మంచం దగ్గరికి నడిపించుకుపోవాలని ప్రయత్నించి లాభం లేదనుకుని- అక్కడే ఓ తల్లిలా పరిచర్యలు చేయడం ఆరంభించింది.

ఐదు నిమిషాల తర్వాత ఓ జీవితాన్ని మోస్తూ భూమ్మీదికి వచ్చిన కొత్తజీవి ఏడుపు...

వర్షం కురుస్తూనే ఉంది.

భారతి ఒక్క క్షణంలో మారిపోయిన తన యింటి వాతావరణాన్ని తలుచుకుని చకితురాలవుతూ కుర్చీలో ఒరిగింది. లీలగా... మగతగా... నిద్రవంటి సుషుప్తిలో,

ఎక్కడి నుండో ఆకాశంలోనుండి పర్వతాలపై నుండి లోయల్లోకి జారిపడిపోతూ తను అరుస్తున్న భీకరమైన అరుపు దిక్కులనిండా ప్రతిధ్వనిస్తూ... భయంకరమైన కల.

ఏడి భరత్

ఏరీ తన విద్యార్థులు

ఏరీ తన మనుష్యులు.......... ఏరి...

ఎక్కడా ఏమీ లేదు...

అంతా శూన్యం.

ఒట్టి ఆకాశం పర్వాతాలు లోయల్లోకి కూలిపోతున్నాయి. తను పాతాళంలోకి అంతరాంతల్లోకి కూలిపోతోంది. అయ్యో ఆసరా ఆసరా... ఏ ఆసరా దొరకడం లేదు... ఎలా... ఎలా...

చటుక్కున కళ్ళు తెరిచింది భారతి కలచెదిరి.

ముఖంపై ఎండ చురుక్కుమంటోంది.

వర్షం ఎప్పుడో వెలిసింది.

ఎదురుగా పూలమొక్కలు తడిసిన ముత్యాల్లా

రాత్రి భరత్ వెళ్ళిపోవడం,

ఎవరో ఆమె...

ఆమె జీవితంలో బాబు పుట్టడం.

ఉలిక్కిపడి లేచి నిలబడి ఎదురుగా వున్న గదిలోని మంచంవైపు చూచింది.

బాబు కాళ్ళూ, చేతులాడిస్తున్నాడు. ఆ స్త్రీ....

ఆమె ఏది. చూపులు వెదుకుతున్నాయి చుట్టూ.

మంచం కోడు దగ్గర ఓ చీటి కనిపించింది.

"కృతజ్ఞతలు తల్లీ" అంతే.

కాగితాన్ని చేతిలో పట్టుకుని, పసివాడి ముఖంలోకి చూచింది భారతి. బోసి నవ్వు, స్వచ్ఛంగా, నిర్మలంగా.

"ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్ స్టార్".

దయ మాత్రమే నిండిన చూపులతో వంగి పసివాణ్ణి ఒడిలోకి తీసుకుంది భారతి.

తల్లిగా ఆమె సాగించవలసిన అనంత యాత్ర మళ్ళీ మొదలైంది.

'పల్లకి' వారపత్రిక
20.11.1986